

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట వర్షంలోనే తడుస్తూ ధర్నా చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

# భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా

- అటవీ శాఖ ఆధీనంలోని భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్
- మూడు రోజుల పాదయాత్రతో కలెక్టరేట్‌కు చేరిన ఆదివాసీలు
- జోరు వానలోనే కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన
- అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హామీతో ఆందోళన విరమణ

కొత్తగూడెం అర్బన్, జూన్ 12 : అటవీ శాఖ ఆధీనంలో ఉన్న అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలోని సర్వే నంబర్ 30, 36, 39లోని భూములు తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు మూడు రోజులుగా పాదయాత్ర చేస్తూ గురువారం భద్రాద్రి కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. జోరు వాన కురుస్తున్నా లెక్క చేయకుండా బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు మడకం నాగేశ్వరరావు మాట్లాడుతూ రామన్నగూడెంకు చెందిన దాదాపు 150 కుటుంబాలు సర్వే నంబర్ 30, 36, 39లోని భూముల్లో తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నాయని తెలిపారు. వారికి ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం ఇచ్చిందని, అయినా లంకలపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ ఇదే అని, ఇది అటవీ శాఖ భూమి అని ఆదివాసీలను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో హైకోర్టు సైతం సాగు చేసుకుంటున్న 573 ఎకరాలు ఆదివాసీలదేనని స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ కోర్టు తీర్పును అధికారులు అమలు చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్ జాయింట్ సర్వే చేయించి ఆదివాసీల భూములు అప్పగించాలని కోరారు. అలాగే రామన్నగూడెంలో మంజూరైన నాలుగు ఇందిరమ్మ ఇండ్లను సైతం గిరిజనేతరులకు కేటాయించి పీసా చట్టాన్ని తుంగలో తొక్కారని, ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా.. ఆందోళన విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వారి వద్దకు చేరుకొని సమస్యను సావధానంగా విన్నారు. కలెక్టర్‌కు సమస్యను వివరించి పది రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆదివాసీల ఆందోళనకు ఆదివాసీ హక్కుల సంఘం, తుడుందెబ్బ నాయకులు వాసం రామకృష్ణ దొర, ఆరెం ప్రశాంత్ తదితరులు సంఘీభావం తెలిపారు.

- ఖమ్మం జిల్లాలో నేటికీ జమకాని సన్నాల బోనస్
- ధాన్యం కొనుగోళ్లు పూర్తయి మూడు నెలలు
- రైతన్నలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- వానకాలం సాగు ప్రారంభమైనా చేతికందని నగదు
- బోనస్ కోసం ఎదురుచూస్తున్న 15,085 మంది అన్నదాతలు

# బోనస్ బకాయి.. ₹53.27 కోట్లు

*ఖమ్మం జిల్లాలో సన్నరకం వడ్లు అమ్మిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.53.27 కోట్ల బోనస్ డబ్బులను చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర కాకుండా అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి రైతులు నిలువునా మోసపోయారు. యాసంగి ముగిసి వానకాలం సీజన్ ప్రారంభమైనా చేతికి బోనస్ నగదు అందలేదు. బోనస్‌కు ఆశపడి రైతులు సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. అధికంగా తరుగుపోతున్నా బోనస్ వస్తుందన్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ధాన్యం అమ్మిన రెండ్రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని సీఎం మాయమాటలు చెప్పారని, మూడు నెలలుగా బోనస్ డబ్బులు రూపాయి కూడా పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఖమ్మం, జూన్ 12*

ఖమ్మం జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో పూర్తయ్యాయి. జిల్లావ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 351 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ వాటిలో 293 కేంద్రాల్లోనే విక్రయాలు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో 131, పీఏసీఎస్ సొసైటీల ఆధ్వర్యంలో 134, మెప్మా ఆధ్వర్యంలో 2, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 26 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిద్వారా ఈ యాసంగి సీజన్‌లో 15,085 మంది రైతుల నుంచి 10,65,285.60 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రూ.53.27 కోట్ల బోనస్ డబ్బులను రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ.. ఇప్పటివరకు రూపాయి కూడా చెల్లించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే గత సీజన్ నుంచే బోనస్ ఇవ్వడం ప్రారంభించింది. దీంతో రైతులు అనుకోని అదృష్టం తమ తలుపు తట్టిందని, వేలల్లో బోనస్ డబ్బులు వస్తాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. దీంతో గత యాసంగి సీజన్‌లో దొడ్డురకం వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గించి ఎక్కువ విస్తీర్ణంలో సన్నరకం సాగు చేశారు. వీరి ఆలోచనలకు తగ్గట్టుగానే గణనీయంగా దిగుబడి పెరిగింది. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సన్నరకం వడ్ల సాగు పెరుగుతుందని ప్రభుత్వం కూడా ముందుగానే ఊహించింది.



### బోనస్ డబ్బులకు బ్రేక్..

ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేసిన ప్రభుత్వం బోనస్ చెల్లించడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నది. బోనస్ డబ్బులు ఎప్పుడెప్పుడు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయా? అని ఎదురుచూస్తున్నారు. రేపోమాపో ఎప్పుడైనా బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు వచ్చిపడొచ్చని అధికారులు మూడు నెలలుగా చెబుతున్నప్పటికీ ఇంకా జమకాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



### 5 శాతం తరుగుతో నష్టపోయిన రైతులు

బోనస్ డబ్బుల కోసం ఆశపడిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. బయట మార్కెట్‌లో సన్న ధాన్యానికి డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించారు. క్వింటా ధాన్యానికి రూ.500 అదనంగా బోనస్ వస్తుందనే ఆశతో ధాన్యాన్ని విక్రయించగా ఇంతవరకు ప్రభుత్వం బోనస్ డబ్బులు ఇవ్వలేదు. మార్చి నుంచి మే నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలను నిర్వహించారు. మిల్లర్లు క్వింటా ధాన్యానికి 5 శాతం తరుగు తీయడం వల్ల రైతులు నష్టపోయారు.

### ఎవరూ పట్టించుకోవట్లేదు..



కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ తప్పకుండా నెరవేరుస్తారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. కానీ.. బోనస్ డబ్బులు ఇప్పటి వరకు పడలేదు. ఇస్తారో ఇవ్వరో అనేది కూడా క్లారిటీ లేదు. వడ్లు అమ్మేందుకు ఎన్ని కష్టాలు పడ్డామో అందరికీ తెలుసు. ఎవరు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. డాల్వ పంట వంద క్వింటాళ్ల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో బోనస్ వస్తుందని పోశాం. చాలా మంది రైతులు బోనస్ ఇస్తారనే నమ్మకం లేదని చెబుతున్నా వేస్తారనే నమ్మకంతో కొనుగోలు కేంద్రానికి తరలించాం. ఇంత వరకు అతీగతీ లేదు.

– కాపు హరిబాబు, రైతు, మొండికుంట, పెనుబల్లి మండలం

### బోనస్ కోసం కష్టాలు పడుతున్నాం..



ధాన్యం కాటాలు వేసి సుమారు 50 రోజులకు పైగా అవుతున్నా బోనస్ పడలేదు. బోనస్ కోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి తేమశాతం వచ్చేంత వరకు మధ్యలో వర్షాలు వచ్చినప్పుడు కూడా ఎన్నో కష్టాలు భరించాం. తీరా తేమ శాతం వచ్చిన తర్వాత లారీలు అందుబాటులో లేవు. బిల్లులు పడలేదంటూ మళ్లీ ఇబ్బందులు పెట్టారు. అయినా బోనస్ పడతది.. కాస్త తోడుగా ఉంటదని అనుకొని 260 క్వింటాళ్ల ధాన్యం పెనుబల్లి ఐకేపీ కేంద్రంలో విక్రయించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు బోనస్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నాం.

– వెలివెల కృష్ణయ్య, రైతు, పెనుబల్లి

# సమస్యలతో స్వాగతం!

- జిల్లాలో తెరుచుకున్న సర్కారు పాఠశాలలు
- ఫీజుల మోత మోగిస్తున్న ప్రైవేటు స్కూళ్లు
- రఘునాథపాలెం మండలంలో పాఠశాలను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- తొలిరోజు 48 శాతం విద్యార్థులు హాజరు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వెనుక డీఈవో

ఖమ్మం అర్బన్, జూన్ 12 : వేసవి సెలవుల తర్వాత తెరుచుకున్న సర్కారు పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికాయి. సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు ఇబ్బందులకు కలగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తామని, ఎలాంటి లోటు లేకుండా చూస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటిమూటలయ్యాయి. ఏ పాఠశాలలో చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. నూతన విద్యాసంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కావడంతో వేసవి సెలవుల్లో ఇన్నాళ్లు ఆడిపాడిన విద్యార్థులు భారంగా బడిబాట పట్టారు. పై తరగతులకు వెళ్లే విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకుని పాఠశాలలకు పయనమయ్యారు. దాదాపు 50 రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో తొలిరోజు తమ మిత్రులను కలుసుకొని ఆనందంగా గడిపారు. దీంతో జిల్లాలోని పాఠశాలలన్నీ పిల్లలతో సందడిగా కనిపించాయి.

### సమస్యల నడుమ సర్కార్ స్కూళ్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతోనే స్వాగతం పలికాయి. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు లేకుండానే బడిగంట మోగింది. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇలాంటి సమస్యలను పరిష్కరించకుండానే అధికారులు నూతన విద్యాసంవత్సరాన్ని ప్రారంభించారు. కనీసం పాఠశాలల్లో మరమ్మతు పనులు కూడా చేయించలేదంటే ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో ఇట్టే అర్థమవుతోంది. బడిబయట మాత్రం పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువులు చెబుతామంటూ అధికారులు ఆర్భాటం చేస్తున్నారు. వ్యవస్థలోని లోపాలు సర్కార్ పాఠశాలల ఖ్యాతికి మచ్చగా నిలుస్తున్నాయి.

- పెరిగిన పాఠ్యపుస్తకాల ధరలు, మోతెక్కిస్తున్న ఫీజుల భారం మోయలేక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఎల్‌కేజీ నుంచే రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా.. ఎక్కువ మంది ప్రైవేట్‌లోనే చదువు'కొన'డానికి సిద్ధమయ్యారు. బస్సు ఫీజులు, యూనిఫాం ధరలు సైతం దడపుట్టిస్తున్నాయి. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నారు.

### తొలిరోజు హాజరు 48 శాతం..

జిల్లాలో తొలిరోజు పాఠశాలల్లో 48 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 21 మండలాల్లో అత్యధికంగా కల్లూరు మండలంలో 68 శాతం హాజరు కాగా.. తర్వాత స్థానాల్లో కొణిజర్ల 59 శాతం, ఎర్రుపాలెం 57 శాతం, తల్లాడ 55 శాతం, నేలకొండపల్లి, కామేపల్లి 52 శాతం ఉన్నాయి. సింగరేణి, చింతకానిలో 51 శాతం నమోదైంది. అత్యల్పంగా ఖమ్మం అర్బన్‌లో 37 శాతం, కూసుమంచి 38 శాతం, బోనకల్లు 40 శాతం ఉంది.

- జిల్లాలో ఎస్‌జీటీ క్యాడర్‌లో 2,325 మంది ఉండగా.. 25 మంది పర్మిషన్‌తో, ముగ్గురు అనధికారికంగా హాజరుకాలేదు. ఎస్ఏ క్యాడర్‌లో 2,516 మందికి 23 మంది పర్మిషన్‌తో హాజరు కాలేదు. హెచ్ఎంల క్యాటగిరీలో 179 మందికి ఒకరు పర్మిషన్‌తో హాజరుకాలేదని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

### పాఠశాలను ప్రారంభించిన కలెక్టర్

రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నామని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈవో సామినేని సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్

## సివిల్ సప్లయీస్ డైరెక్టర్‌గా ప్రస్తుత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బదిలీ

ఖమ్మం, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టిని నియమితులయ్యారు. ప్రస్తుతం ఖమ్మం కలెక్టర్‌గా పనిచేస్తున్న ముజమ్మిల్ ఖాన్ రాష్ట్ర సివిల్ సప్లయీస్ డైరెక్టర్‌గా, హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత సంవత్సరం జూన్‌లో పెద్దపల్లి జిల్లా నుంచి బదిలీపై ఖమ్మం కలెక్టర్‌గా వచ్చిన ముజమ్మిల్ ఖాన్.. ఏడాదిపాటు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ కాలంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించారు. ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారన్న పేరొందారు. క్షేత్రస్థాయిలో పర్యటనలను నిరంతరం చేయడం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేయడానికి ప్రయత్నించారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, వారిని ఆకాశమంత ఎదగనివ్వాలని ఆకాంక్షిస్తూ 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో కూర్చొని పాఠాలు విన్నారు. కొన్ని కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

### అనుదీప్‌కు ఉమ్మడి జిల్లాతో అనుబంధం..

హైదరాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అనుదీప్ బదిలీపై ఖమ్మం కలెక్టర్‌గా వస్తున్నారు. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనుదీప్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2019, మే 24న భద్రాద్రి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత అదే జిల్లాలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా పనిచేశారు. 2021, జూన్ 1న భద్రాద్రి జిల్లా కలెక్టర్‌గా నియమితులై 2023, జూన్ 15 వరకూ పనిచేశారు. పాలనాపరంగా భద్రాద్రి జిల్లాపై తనదైన ముద్రవేసుకున్నారన్న పేరొందారు. భద్రాచలంలో వరదల సమయంలో వరద బాధితులకు మెరుగైన సేవలందించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషించారు. పాలనాపరమైన అంశాలపై పట్టున్న అధికారిగా, సౌమ్యుడిగా, మితభాషిగా అనుదీప్‌కు పేరుంది. ఆయన ఖమ్మం కలెక్టర్‌గా నియమితులు కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో ఆయనకున్న అనుబంధం పాలనాపరంగా మరింత ఉపయోగపడే అవకాశం ఉందన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. భద్రాద్రి కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో సంస్కరణలను చేపట్టడంతోపాటు పాఠశాల విద్య, గిరిజన సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.



కలెక్టర్ అనుదీప్



వాకిటి శ్రీహరి



గౌతమ్ పోట్రు

### ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'వాకిటి శ్రీహరి'

ఖమ్మం, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నూతన మంత్రి వాకిటి శ్రీహరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థానంలో ఇటీవల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని ప్రభుత్వం నియమించింది.


### నల్లగొండ నుంచి కరీంనగర్‌కు తుమ్మల..

ఖమ్మం జిల్లా నుంచి మంత్రులుగా ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వరంగల్ ఇన్‌చార్జి మంత్రిగా ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తోంది. కానీ.. నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించింది. తుమ్మల స్థానంలో నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నూతన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### సింగరేణి డైరెక్టర్ (పా)గా గౌతమ్ పోట్రు

ఖమ్మం, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి సంస్థలో కీలకమైన పోస్టుగా భావించే డైరెక్టర్ (పా)గా ఐఏఎస్ అధికారి గౌతమ్ పోట్రును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. భద్రాచలం ఐటీడీఏ పీవోగా గత సంవత్సరం వరకూ పనిచేసిన గౌతమ్ పోట్రు.. ప్రస్తుతం మేడ్చల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. సింగరేణిలో అత్యంత కీలకమైన డైరెక్టర్ (పా) పోస్టును ప్రభుత్వం ఐఏఎస్ అధికారితో భర్తీ చేసింది.




మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616